# చట్టాల రూపకల్పనను గవర్నర్లు అడ్డుకోలేరు

## 'కేరళ వర్సెస్ గవర్నర్' కేసులో సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: చట్టాల రూపకల్పన ప్రక్రియను గవర్నర్లు అడ్డుకోలేరని పంజాబ్ కేసులో ఇచ్చిన తీర్పు.. కేరళకు కూడా వర్తిస్తుందని సుప్రీంకోర్టు నర్మగర్భంగా వ్యాఖ్యానించింది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ వ్యవహరిస్తున్న తీరును తప్పుబడుతూ కేరళ ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టులో వాదనలు జరిగాయి. ఈ కేసులో కేంద్రం, కేరళ గవర్నర్ అడిషనల్ చీఫ్ సెక్రటరీకి సుప్రీం ఇంతక్రితమే నోటీసులు జారీ చేసింది. కేసు విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. కేరళ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్‌ను ఉద్దేశించి సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'క్రితం రోజే పంజాబ్ విషయంలో మేం జారీచేసిన ఉత్తర్వులు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాం. దీనిని రిఫర్ చేయాలని గవర్నర్ అడిషనల్ సెక్రటరీని అడగండి' అని సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొన్నది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లుపై గవర్నర్లు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో ఉంచలేరని, బిల్లును ఆమోదించటమే లేదా పునఃసమీక్ష నిమిత్తం తిరిగి వెనక్కి పంపటమో ఏదో ఒకటి చేయాల్సి ఉంటుందని పంజాబ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది.

# కులగణన అధికారం రాష్ట్రానికి లేదు

## ఆ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే: కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

హుబ్బళ్లి: కులగణన చేపట్టే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, ఆ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ స్పష్టం చేశారు. కర్ణాటకలో కులగణన వ్యవహారంపై ఆయన ఈ మేరకు స్పందించారు. కులగణన చేపడుతామని కర్ణాటక ప్రభుత్వం చెబుతున్నదని, అయితే రాష్ట్రానికి ఆ అధికారం లేదన్నారు. కులగణన విషయంలో కర్ణాటక ప్రభుత్వంలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మరో నేత శివశంకరప్ప కులగణనను వ్యతిరేకిస్తున్నారని వెల్లడించారు. కులగణన విషయంలో కర్ణాటక ప్రభుత్వం గందరగోళాన్ని సృష్టిస్తున్నదని పేర్కొన్నారు.

- జవాన్ మరణంపై బీజేపీ రాజకీయాలు

*అమర జవాన్లను బీజేపీ తమ రాజకీయ లబ్ధికి వాడుకుంటున్నది. ఇటీవల కశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైన జవాన్ శుభమ్‌గుప్తా కుటుంబానికి పరిహారం ఇచ్చేందుకు వెళ్లిన యూపీ మంత్రి యోగేంద్ర తీరు విమర్శలకు దారితీసింది. ఓ వైపు జవాన్ తల్లి బోరున విలపిస్తుండగా, మరోవైపు మంత్రి ఫొటోకు ఫోజులివ్వడంపైనే దృష్టిపెట్టడంపై ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. 'మీ ప్రదర్శనలోకి నన్ను లాక్కండి.. నా బిడ్డను నాకు తెచ్చివ్వండి' అంటూ ఆ తల్లి రోదించింది.*

# కాంగ్రెస్ వస్తే కరెంట్ షాకులే!

- పగ్గాలు చేపట్టగానే ఎడాపెడా చార్జీల మోత
- కర్ణాటక, రాజస్థాన్, హిమాచల్, ఛత్తీస్‌గఢ్‌లో అధికారాన్ని చేపట్టగానే కరెంట్ చార్జీల వాత
- యూనిట్‌కు గరిష్టంగా రూపాయి వరకు పెంపు
- బిల్లు డబుల్ వస్తున్నదంటూ సామాన్యుల గగ్గోలు

*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*
*హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, విద్యుత్తు కోతలే కాదు.. కరెంటు షాకులు కూడా తగులుతాయి. మొన్నటికి మొన్న అధికారంలోకి వచ్చిన కర్ణాటకతోపాటు హస్తం పార్టీ అధికారంలో ఉన్న హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో విద్యుత్తు బిల్లులపై చార్జీల పెంపే దీనికి నిదర్శనం*

**కర్ణాటకలో బిల్లుల మోత**

గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు తగినంత విద్యుత్తు సరఫరా చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కర్ణాటకలో కరెంటు కోతలకు తెగబడుతున్నది. సరఫరా చేసే ఆ కొంత కరెంటుపై కూడా కాంగ్రెస్ సర్కారు ఎడాపెడా బిల్లుల మోత మోగిస్తున్నది. ఎక్స్‌ట్రా ఫ్యూయెల్ అడ్జస్ట్‌మెంట్ కాస్ట్ (ఎఫ్‌పీసీ) పేరిట యూనిట్‌కు 85 పైసలను సర్కారు ఇటీవలే అదనంగా పెంచింది. కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమలను కూడా విడిచిపెట్టలేదు. మూడేండ్లకుగానూ స్పెషల్ పవర్ టారిఫ్‌ను తీసుకొస్తున్నట్టు పారిశ్రామికవేత్తలకు సర్కారు తాజాగా షాక్ ఇచ్చింది. కరెంటు బిల్లులపై వినియోగదారులకు కచ్చితమైన అవగాహన ఉండటానికే మల్టీ-ఇయర్-టారిఫ్స్ (ఎంవైటీ)ని తీసుకొచ్చినట్టు కర్ణాటక ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (కేఈఆర్‌సీ) వెల్లడించింది. అయితే, ప్రభుత్వ నిర్ణయంపై కర్ణాటక చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ (ఎఫ్‌కేసీసీఐ) మండిపడింది. దేశంలోని మిగతా రాష్ట్రాలు ఎంవైటీ విధానాన్ని తీసుకురాకముందే, ఎలాంటి అధ్యయనం చేయకుండానే కర్ణాటక కాంగ్రెస్ సర్కారు ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజా నిర్ణయం పరిశ్రమలకు పెను భారమేనని ఆందోళన వ్యక్తం చేసింది.

### కర్ణాటకలో డబుల్ బాదుడు

*తెలంగాణతో పోల్చితే కర్ణాటకలో విద్యుత్తు బిల్లులను రెండింతలు ఎక్కువ వసూలు చేస్తున్నారని అక్కడి ప్రజలు వాపోతున్నారు. ఉదాహరణకు కర్ణాటకలో ఒక వినియోగదారుడు గృహ అవసరాలకు 3కిలోవాట్‌ల లోడ్‌తో 163 యూనిట్ల కరెంటు కాలుస్తే వివిధ పన్నులు కలుపుకుని వచ్చే బిల్లు రూ. 1544 కాగా అదే తెలంగాణలో కేవలం రూ.713 వసూలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన రెండు బిల్లుల కాపీలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.*

**మిగతా రాష్ట్రాల్లోనూ కరెంట్ షాక్**

అధికారంలోకి వస్తే, 125 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామంటూ హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ హామీనిచ్చింది. ఉచిత విద్యుత్తు మాట ఏమోగానీ, వచ్చీరాగానే గత ఫిబ్రవరిలో విద్యుత్తు చార్జీలను యూనిట్‌కు 86 పైసల మేర పెంచింది. తిరిగి ఏప్రిల్‌లో మరో 22 పైసలు వాతపెట్టింది. ఇక, రాజస్థాన్‌లో గత ఏప్రిల్‌లో రెండు విడుతల్లో యూనిట్‌కు ఏకంగా 75 పైసల చొప్పున చార్జీలు పెంచింది. దీంతో గతంలో రూ. 200 వచ్చే కరెంటు బిల్లులు రూ. 600 కంటే ఎక్కువ వస్తున్నట్టు వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో పగ్గాలు చేపట్టిన తర్వాత 2021లో 6.19 శాతం మేర పవర్ టారిఫ్‌ను పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కిందటేడాది ఏప్రిల్‌లో మరో 2.31 శాతం మేర టారిఫ్‌ను పెంచింది. దీంతో విద్యుత్తు బిల్లులు డబుల్ వస్తున్నాయని సామాన్యులు మండిపడుతున్నారు.



*కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో విద్యుత్తు బిల్లుల్లో వ్యత్యాసాలు*

# డీకేను కాపాడే యత్నం

- సీబీఐ కేసు ఉపసంహరణ చట్ట విరుద్ధం
- సిద్ధరామయ్య సర్కారుపై విపక్షాల ధ్వజం

బెంగళూరు: డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అక్రమాస్తులపై సీబీఐ కేసును ఉపసంహరిస్తూ కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న నిర్ణయంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. శివకుమార్‌ను కాపాడే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, కేసును వెనక్కి తీసుకోవటం అనైతికం, చట్ట విరుద్ధమని బీజేపీ, జేడీ(ఎస్) ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ అంశాన్ని అసెంబ్లీ లోపల, బయట లేవనెత్తుతామని విపక్షాలు గురువారం ప్రకటించాయి. 'కాంగ్రెస్ సర్కార్ నిర్ణయం క్షమించరాని తప్పు. డీకేను కాపాడుతూ ప్రభుత్వం ఇలా చేయటం ప్రజల్ని మోసం చేయటమే' అని మాజీ సీఎం యెడియూరప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసును సీబీఐకి అప్పగించటాన్ని కర్ణాటక హైకోర్టు కూడా సమర్థించిందని, ఇప్పుడు కేసును ఉపసంహరిస్తూ నిర్ణయం చేసే అధికారం ఎవరికీ లేదని, ఇది చట్ట విరుద్ధమని చెప్పారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'డీకే శివకుమార్ అక్రమాస్తుల వ్యవహారంపై దర్యాప్తు చేసిన ఈడీ.. అవినీతి ఆరోపణలు నిజమేనని తేల్చింది. సరైన చర్య తీసుకోవాలని ఆనాడున్న ప్రభుత్వానికి సూచించింది. అడ్వొకేట్ జనరల్ సలహా మేరకు కేసును సీబీఐకి అప్పగించాం. సీబీఐకి అప్పగించాలా? లేదా? అన్నది రాష్ట్ర ప్రభుత్వ విచక్షణాధికారం. దాని ప్రకారం నిర్ణయం చేశాం' అని అన్నారు

# గుజరాత్‌లో దళితుడిపై దాష్టీకం

- జీతం అడిగినందుకు బలవంతంగా నోట్లోకి యజమానురాలు చెప్పులు
- బాధితుడిని విచక్షణారహితంగా చితకబాదిన ఆరుగురు వ్యక్తులు
- మళ్లీ ఫ్యాక్టరీ పరిసరాల్లో కనిపిస్తే చంపేస్తామంటూ బెదిరింపులు
- డబ్బు దోచుకోవడానికి వచ్చానని బాధితుడితో చెప్పించి వీడియో చిత్రీకరణ
- ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలో దళితులపై పెరిగిపోతున్న దాడులు

మోర్బీ, నవంబర్ 24: ప్రధాని నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం, బీజేపీ పాలిత గుజరాత్‌లో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. చేసిన పనికి జీతం ఇమ్మని అడిగినందుకు ఒక దళిత ఉద్యోగిపై యజమానురాలు, మరికొందరు అమానుషంగా వ్యవహరించారు. బాధితుడిని ఇష్టారీతిన చితకబాదారు. అంతటితో ఆగకుండా యజమానురాలు అతడి నోట్లో బలవంతంగా తన చెప్పులు పెట్టి, క్షమాపణలు చెప్పించారు. బుధవారం మోర్బీలో జరిగిన ఈ ఘటనపై గురువారం ఎఫ్ఐఆర్ నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. బాధితుడు నీలేశ్ దల్సనియా.. విభూతి పటేల్ అనే మహిళ నిర్వహిస్తున్న రనీబా ఇండస్ట్రీస్‌లో నెలకు రూ.12 వేల వేతనానికి అక్టోబర్ నెల ప్రారంభంలో మార్కెటింగ్ ఉద్యోగంలో చేరాడు. హఠాత్తుగా అదే నెల 18న అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. తనకు రావాల్సిన 16 రోజుల జీతం చెల్లించాలని నీలేశ్ అడిగినప్పుడు ఆమె స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. బుధవారం నీలేశ్ తన సోదరుడు, పొరుగింటి వ్యక్తితో కలిసి విభూతి పటేల్ ఆఫీసుకు వెళ్లగానే ఆమె సోదరుడు ఓమ్ పటేల్, ఆమె కార్యాలయం మేనేజర్, మరో నలుగురు అక్కడకు చేరుకొని ఆ ముగ్గురిపై విచక్షణారహితంగా దాడి చేశారు. బెల్ట్‌తో కొట్టి కాళ్లతో తన్ని పిడిగుద్దులు కురిపించారు. తర్వాత విభూతి పటేల్ నీలేశ్‌ను చెంప దెబ్బ కొట్టి టెర్రస్ పైకి ఈడ్చుకెళ్లింది. నోట్లో తన చెప్పులు పెట్టి, క్షమాపణ అడగాలని నిందితురాలు విభూతి పటేల్ తనను ఒత్తిడి చేశారని బాధితుడు వాపోయారు. ఇంకోసారి తన ఫ్యాక్టరీ పరిసరాల్లో కనిపిస్తే చంపేస్తానని ఆమె తనను బెదిరించిందని తెలిపారు. బలవంతంగా డబ్బు లాక్కోవడానికి తానే వారి ఆఫీసుకి వెళ్లినట్టు తనతో చెప్పించి వీడియో తీశారని ఆవేదన వ్యక్తంచేశారు. జీతం అడిగినందుకు క్షమాపణ చెప్పాలని నిందితులు బాధితుడిని బలవంతం చేయడం వీడియోలో కనిపించింది. తీవ్రంగా గాయపడిన బాధితుడు ప్రస్తుతం మోర్బి సివిల్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉందని, నిందితులు ఎవరినీ ఇప్పటివరకు అరెస్ట్ చేయలేదని పోలీసులు తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని, వారిని గాలించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని డీఎస్పీ ప్రతిపాల్ సిన్హ్ వెల్లడించారు.

*రబీనా ఇండస్ట్రీస్ యజమానురాలు విభూతి పటేల్. వీపుపై గాయాలతో నీలేశ్ దల్సనియా*

**డబుల్ ట్రబుల్ ఇంజిన్**

# నేడు రాజస్థాన్‌లో పోలింగ్

## 199 స్థానాల్లో ఓటింగ్

### కాంగ్రెస్, బీజేపీలకు 40 స్థానాల్లో రెబెల్స్ బెడద

జైపూర్, నవంబర్ 24: అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ భవితవ్యం ఏమిటో తేల్చేందుకు రాజస్థాన్ ఓటర్లు సిద్ధమయ్యారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 199 స్థానాలకు పోలింగ్ జరగనుంది. తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలతో పాటు కొత్తగా ప్రకటించిన ఏడు గ్యారెంటీల గురించి అధికార కాంగ్రెస్ విస్తృత ప్రచారం నిర్వహించింది. మహిళలపై నేరాలు, అవినీతి, పేపర్ల లీకేజీ అంశాలను బీజేపీ తన ప్రచారాస్త్రాలుగా మార్చుకొంది. బీజేపీ 59 మంది సిట్టింగ్‌లకు టికెట్లివ్వగా.. కాంగ్రెస్ పార్టీ 97 మంది ఎమ్మెల్యేలను మళ్లీ బరిలో నిలిపింది. పోటీ ప్రధానంగా ఈ రెండు పార్టీల మధ్యనే ఉన్నా.. సీపీఎం, ఆర్ఎల్‌పీ, భారత్ ఆదివాసీ పార్టీ, భారతీయ ట్రైబల్ పార్టీ, ఆప్, ఎంఐఎం కూడా బరిలో నిలిచాయి. కాంగ్రెస్, బీజేపీలకు 40 స్థానాల్లో రెబెల్స్ నుంచి పోటీ ఎదురవుతున్నది. రాష్ట్రంలోని మొత్తం 5.25 కోట్ల ఓటర్లలో 18-30 ఏండ్ల వయసు కలిగిన యువత 1.70 కోట్ల మంది ఉన్నారు.

# హమాస్ చెర నుంచి 25 మంది విడుదల

గాజా: తమ వద్ద బందీలుగా ఉన్నవారిలో మొదటి విడతగా హమాస్ 25 మంది పౌరులను గాజాస్ట్రిప్ నుంచి శుక్రవారం విడుదల చేసింది. వీరిలో 13 మంది ఇజ్రాయెల్, 12 మంది థాయ్ పౌరులు ఉన్నారు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా వీరిని విడిచిపెట్టినట్టు ఇజ్రాయెల్ మీడియా వెల్లడించింది. ఇజ్రాయెల్ కూడా శుక్రవారం తమ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న 39 మంది పాలస్తీనియన్లను విడిచిపెట్టింది. వీరిలో 24 మంది మహిళలు, 15 మంది టీనేజర్లు ఉన్నారు.

# సొరంగంలో సహాయ చర్యలకు మళ్లీ అంతరాయం

ఉత్తర్‌కాశీ : ఉత్తరాఖండ్ ఉత్తర్‌కాశీ సొరంగంలో సహాయ చర్యలకు శుక్రవారం మళ్లీ అంతరాయం కలిగింది. డ్రిల్లింగ్ యంత్రానికి అవరోధం ఎదురు కావడంతో సాంకేతిక కారణాల వల్ల డ్రిల్లింగ్ ఆపేయాల్సి వచ్చింది. శుక్రవారం డ్రిల్లింగ్ ప్రారంభించిన కొద్దిసేపటికే ఈ పరిస్థితి ఏర్పడింది. కూలిన శిథిలాల మార్గంలో 48.6 మీటర్ల మేర అధికారులు క్లియర్ చేశారు. మిగతా శిథిలాలను తొలగిస్తే లోపల చిక్కుకున్న కార్మికులను బయటకు తీసుకొచ్చేందుకు అవకాశం ఉంటుంది.

# గదిలోకి పాము వదిలి భార్య, బిడ్డ హత్య

బెర్హాంపూర్ (ఒడిశా): బెడ్రూమ్‌లోకి తాచుపామును వదిలి భార్య, బిడ్డను చంపేశాడు ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి. భార్యతో తరచూ గొడవల కారణంగా ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బెర్హాంపూర్ జిల్లా కబిసూర్యనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అధేయిగావ్‌లో ఈ ఘటన గత నెలలో చోటుచేసుకున్నది. మృతురాలి భర్తను పోలీసులు అరెస్టుచేశారు. కే గణేశ్‌పాత్రతో కే బసంతిపాత్ర (23)కి నాలుగేండ్ల క్రితం వివాహమైంది. వీరి రెండేండ్ల కూతురు దేబస్మి ఉన్నది. ఎలాగైనా భార్యను చంపాలనుకున్న గణేశ్.. పాములు పట్టేవారిని సంప్రదించి తాచుపామును కొన్నాడు. ప్లాస్టిక్ జార్‌లో పామును తెచ్చి భార్యబిడ్డలు పడుకున్న గదిలో రాత్రి వదిలాడు.

# ఖైదీ బిడ్డకు పోలీస్ చనుబాలు

కొచ్చి, నవంబర్ 24: ఐసీయూలో చికిత్స పొందుతున్న ఓ ఖైదీ భార్య బిడ్డకు పాలిచ్చి తల్లి మనసు అంటే ఏంటో కళ్లకు కట్టారు కొచ్చి సివిల్ పోలీస్ ఆఫీసర్ ఆర్య. పాట్నాకు చెందిన ఓ మహిళ నలుగురు పిల్లలతో కేరళలో జీవనం సాగిస్తున్నది. ఆమె భర్త ఓ కేసులో ప్రస్తుతం జైలులో ఉన్నారు. మహిళ అనారోగ్యంతో బాధపడుతుండగా ఎర్నాకుళంలోని దవాఖానలో చేర్చారు. నలుగురి పిల్లలకు ఠాణాలో ఆశ్రయమిచ్చారు. వారిలో తొమ్మిది నెలల చిన్నారికికి ఆపద సమయంలో ఆర్య పాలిచ్చి మానవత్వం చాటారు.

# డ్రగ్స్ కోసం కన్నబిడ్డల్ని అమ్మేశారు

## మహారాష్ట్రలో దారుణం

ముంబై (నమస్తే తెలంగాణ): డ్రగ్స్‌కు బానిసలైన దంపతులు ఇద్దరు కన్నబిడ్డల్ని రూ.74 వేలకు అమ్మేసి ఆ సొమ్ముతో డ్రగ్స్ సేవించారు. ముంబైలో జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. షబ్బీర్‌ఖాన్, సానియా దంపతులు డ్రగ్స్‌కు బానిసయ్యారు. డ్రగ్స్ కొనేందుకు డబ్బుల కోసం వీరు తమ పిల్లలను అమ్మేశారు. షబ్బీర్ సోదరి ఫిర్యాదుతో కదిలిన పోలీసులు బాధితుల్లో ఒకరైన రెండు నెలల చిన్నారిని రక్షించారు.

# విమానాలకు సిగ్నల్ ముప్పు

- పశ్చిమాసియాలో స్పూఫ్ సిగ్నల్స్
- పౌర విమానాలకు నకిలీ సంకేతాలు
- ప్రమాదాలకు దారితీయొచ్చు
- విమానయాన సంస్థలకు డీజీసీఏ హెచ్చరిక

*న్యూఢిల్లీ, నవంబర్ 24: పౌర విమానాలకు పశ్చిమ ఆసియాలో తీవ్ర ముప్పు పొంచి ఉన్నదని విమానయాన సంస్థలకు డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) హెచ్చరికలు జారీచేసింది. ఇరాన్, ఉత్తర ఇరాక్, అజర్‌బైజాన్ ప్రాంతంలో పౌర విమానాలు తరుచూ జీపీఎస్ సంకేతాలను కోల్పోయి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నాయని తెలిపింది. ఈ ప్రాంతంలో విమానాల నేవిగేషన్ వ్యవస్థలు తరుచూ ఆగిపోతున్నాయని, ఇది తీవ్ర ప్రమాదాలకు దారితీయొచ్చని హెచ్చరించింది. 'గ్లోబల్ నేవిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జీఎన్ఎస్ఎస్) నివేదికను బట్టి ఏవియేషన్ పరిశ్రమ కొత్త తరమైన జామింగ్, స్పూఫింగ్ ప్రమాదాలతో కొట్టుమిట్టాడుతున్నది. పశ్చిమ ఆసియా గగనతలంపై ప్రమాదకర జోక్యం ఇటీవల పెరుగుతున్నది' అని పేర్కొన్నది. నేవిగేషన్ వ్యవస్థను జామ్ చేయకుండా చర్యలు చేపట్టాల్సి ఉన్నదని తెలిపింది. గత నెలలో పశ్చిమ ఆసియా గగనతలంలో చాలా పౌర విమానాలు ఎలాంటి జీపీఎస్ అనుసంధానం లేకుండా గుడ్డిగా ప్రయాణించాయని వెల్లడించింది.*

*స్పూఫ్ సిగ్నల్ ఎలా పనిచేస్తుంది? విమానం గాల్లోకి లేచినది మొదలు.. మళ్లీ నేలపైకి దిగేవరకు దానికి ఎటు వెళ్లాలి? ఏ మార్గంలో వెళ్లాలి అనేది మార్గదర్శనం చేసేది జీపీఎస్ వ్యవస్థనే. ఈ వ్యవస్థ లేకపోతే చీకట్లో ప్రయాణించినట్టే.. ఇంతటి కీలక వ్యవస్థ పశ్చిమ ఆసియాలో కొన్ని సార్లు విఫలమవుతున్నది. ఇరాన్, ఇరాక్, అజర్‌బైజాన్ గగనతలంలోకి విమానాలు ప్రవేశించగానే ఓ నకిలీ జీపీఎస్ సిగ్నల్ విమానాలకు అందుతున్నది. ఇది విమానంలోని జీపీఎస్ వ్యవస్థను ఏమారుస్తున్నది. వెళ్లాల్సిన మార్గాన్ని వదిలి వందల కిలోమీటర్ల దూరం వేరే మార్గంలో ప్రయాణిస్తున్నట్టు భ్రమింపజేస్తున్నది. ఆ సిగ్నల్ కూడా శక్తిమంతంగా ఉంటుండటంతో విమానంలోని జీపీఎస్ వ్యవస్థ గందరగోళంలో పడిపోతున్నది. అలా కొన్ని నిమిషాల్లోనే ఇనెర్షియల్ రిఫరెన్స్ సిస్టమ్ (ఐఆర్ఎస్) నియంత్రణ కోల్పోతున్నది. ఆ వెంటనే విమానం భూమిపై నుంచి తన నిజమైన జీపీఎస్ సిగ్నల్ కోల్పోతున్నది. దీనివల్ల విమానం చుక్కాని లేని నావలాగా ఆకాశంలో తన మార్గాన్ని వదిలి మరో దిశకు ప్రయాణిస్తున్నది. ఆ ప్రాంతాల్లో అంతర్యుద్ధ వాతావరణం ఉండటంతో భారీ ఆయుధ వ్యవస్థలు మోహరించినట్టు తెలుస్తున్నదని, వాటి నుంచే ఈ నకిలీ జీపీఎస్ సిగ్నళ్లు వస్తుండవచ్చని పేర్కొన్నది.*

# కశ్మీర్‌లో విద్యుత్తు సంక్షోభం

## రోజుకు 16 గంటలపాటు కరెంట్ కోతలు

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లో విద్యుత్తు సంక్షోభం నెలకొన్నది. ముఖ్యంగా కశ్మీర్‌లో రోజుకు 16 గంటలపాటు కరెంట్ కోతలు విధిస్తున్నారు. వాస్తవానికి రోజుకు 16 గంటల కరెంట్ సప్లై చేయాలంటే 1800 మెగావాట్ల విద్యుత్తు అవసరం. కానీ ప్రస్తుతం రోజుకు 50-100 మెగావాట్ల కరెంట్ మాత్రమే ఉత్పత్తి అవుతున్నది. దీంతో కశ్మీర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు దశాబ్దాలలో ఇంత ఎక్కువ సమయం కరెంట్ కోతలు విధించడం ఇదే తొలిసారి అని స్థానికులు చెప్పారు. సమస్యపై లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం స్పందిస్తూ కమిటీని ఏర్పాటు చేసి విద్యుత్తు కొనుగోలు చేస్తామని వెల్లడించింది. రాజకీయ నాయకులు మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకొన్న ప్రభుత్వం ఉంటే కరెంట్ సమస్య వచ్చేది కాదన్నారు.

# పురుగులను చంపకుండా పట్టు

## కొత్త పద్ధతికి ఒడిశా సర్కారు శ్రీకారం

భువనేశ్వర్: పట్టుపురుగులను చంపకుండా పట్టును ఉత్పత్తిచేసే సరికొత్త పద్ధతికి ఒడిశా సర్కారు శ్రీకారం చుట్టింది. దీనికి 'కరుణ సిల్క్'గా నామకరణం చేసింది. తమ సీఎం నవీన్ పట్నాయక్ ఎల్లప్పుడు అహింసను ఆచరిస్తారని, అన్ని ఉత్పత్తులు ఇదే పద్ధతిలో ఉండాలని కోరుకుంటారని ఆ రాష్ట్ర హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్, హ్యాండిక్రాఫ్ట్ శాఖ డైరెక్టర్ శోభన్ కృష్ణ తెలిపారు. అందుకే తాము సంప్రదాయ పద్ధతి ఫిలమెంట్ సిల్క్‌కు స్వస్తి చెప్పి కొత్తపద్ధతిలో పట్టు ఉత్పత్తి చేస్తున్నట్టు చెప్పారు. ఈ పద్ధతిలో పట్టుపురుగులు చనిపోవని, కకూన్ నుంచి మాత్‌లు ఎగిరిపోగానే పట్టు దారాన్ని సేకరిస్తామని తెలిపారు.

# మరింత చిక్కుల్లో మొయిత్రా

న్యూఢిల్లీ, నవంబర్ 24: పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా మరింత చిక్కుల్లో పడ్డారు. మొయిత్రా పార్లమెంట్ ఐడీ దుబాయ్ నుంచే కాదు అమెరికాలోని న్యూజెర్సీ, బెంగళూరు నుంచి కూడా లాగిన్ అయినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్‌లో అడగాల్సిన ప్రశ్నలు టైప్ చేయడానికి తన పార్లమెంట్ ఐడీని వ్యాపారవేత్త దర్శన్ హీరానందనీకి ఇచ్చినట్టు ఆమె ఇదివరకే ఒక ఇంటర్వ్యూలో అంగీకరించారు. కాగా, తాజాగా మొయిత్రా లాగిన్‌పై వెల్లడైన అంశాలను పరిగణనలోకి తీసుకునే ఆమెను లోక్‌సభ సభ్యత్వం నుంచి బహిష్కరించాలని పార్లమెంట్ ఎథిక్స్ కమిటీ సిఫార్సు చేసినట్టు తెలిసింది.

# డీప్‌ఫేక్‌లపై సోషల్ మీడియా సంస్థలకు వారం డెడ్‌లైన్

న్యూఢిల్లీ: డీప్‌ఫేక్స్ కంటెంట్ (ఫొటోలు, వీడియోలు)తో ప్రజల్ని తప్పుదోవ పట్టించకుండా అడ్డుకునేందుకు సోషల్‌మీడియా సంస్థలు వెంటనే చర్యలు చేపట్టాలని, భారత నిబంధనల్ని అనుసరించి ఓ విధానాన్ని వారంలోగా తీసుకురావాలని కేంద్రం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుత ఐటీ నిబంధనల ప్రకారం, ప్రభుత్వ యంత్రాంగం లేదా యూజర్ల నుంచి ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా చర్యలు తీసుకోవాలని, 12 రకాల కంటెంట్‌ను తొలగించాలని కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. ఐటీ నిబంధనలను ఉల్లంఘించినట్టు తేలితే కోర్టు విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

# భారత్‌లో అఫ్గాన్ ఎంబసీ శాశ్వతంగా మూసివేత

న్యూఢిల్లీ, నవంబర్ 24: భారత్‌లోని అఫ్గానిస్థాన్ రాయబార కార్యాలయాన్ని శాశ్వతంగా మూసివేస్తున్నట్టు ఆ దేశ